క్లుప్తంగా...

జిల్లా సదస్సును విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు పానుగంటి పర్వతాలు

రాజేంద్రనగర్: కార్మిక సంఘాల జిల్లా సదస్సును విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు పానుగంటి పర్వతాలు పిలుపునిచ్చారు. ఆదివారం సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు కనీస వేతనాలను అమలు చేయకుండా మోసం చేస్తున్న పరిశ్రమ యాజమాన్యాలపై తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ కార్మికులు గత పది రోజులుగా సమ్మె చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం వారి సమస్యలను పరిష్కరించకపోవడం దుర్మార్గమని ఆయన మండిపడ్డారు. జూలై 1న శంషాబాద్‌లో జరిగే కార్మిక సంఘాల జిల్లా సదస్సులో కార్మికుల సమస్యలపై భవిష్యత్తు కార్యాచరణపై చర్చ జరుగుతుందని ఆయన తెలిపారు. ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కె.రామస్వామి, జిల్లా ఏఐటీయూసీ సబ్ కమిటీ సభ్యులు శేఖర్ రెడ్డి, జిల్లా కార్యదర్శులు సత్యనారాయణ, వనంపల్లి జైపాల్‌రెడ్డి, చందుయాదవ్, హరిసింగ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సేవియర్స్ చర్చి నూతన కార్యవర్గం



మణికొండ: మణికొండ సేవియర్స్ లూథరస్ చర్చి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆదివారం జరిగిన సమావేశంలో అధ్యక్షుడిగా కె.ప్రతిభరాజు, ఉపాధ్యక్షుడిగా డేవిడ్, ప్రధాన కార్యదర్శిగా రాజేష్, సంయుక్త కార్యదర్శులుగా ఆడిరాజు, సుమన్, కోశాధికారిగా డేవిడ్‌లను ఎన్నుకున్నారు. ఆశీష్, నటరాజ్, రాజ్‌కుమార్, ఎం.శరత్, సుగుణవెస్లీలను కార్యవర్గసభ్యులుగా నియమించారు. రెండేళ్ల పదవీ కాలానికి నిర్వహణ బాధ్యతలను చూసుకుంటారని సభ్యులు తెలిపారు. ఫాస్టర్ ఎస్.రామకృష్ణ చర్చి అభివృద్ధికి పూర్తి స్థాయిలో పనిచేయాలని సూచించారు.

గ్రో ఇన్ స్టెప్స్ డే కేర్ స్కూల్ ప్రారంభం



జోద్‌పూర్ హైకోర్టు డిప్యూటీ రిటైర్డ్ రిజిస్ట్రార్ బీసీ మాథూర్

రాజేంద్రనగర్: అత్తాపూర్ స్పెన్సర్ సూపర్ మార్కెట్ సమీపంలో ఆదివారం ఉదయం గ్రో ఇన్ స్టెప్స్ డే కేర్ స్కూల్‌ను జోద్‌పూర్ హైకోర్టు డిప్యూటీ రిటైర్డ్ రిజిస్ట్రార్ బీసీ మాథూర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయన్నారు. అందుకు అనుగుణంగా ప్రైవేటు పాఠశాలలను తీర్చిదిద్దుతున్నారన్నారు. కార్యక్రమంలో చైర్మన్ మాడుగుల సంతోష్‌కుమార్, డైరెక్టర్ మాడుగుల కవిత తదితరులు పాల్గొన్నారు.

నూతన నియామకం

మహేశ్వరం: మహేశ్వరం కురుమ సంఘం పెద్ద కురుమగా ఆశన్నగారి బాలయ్య, సెల్వోజీగా పీఏసీఎస్ డైరెక్టర్ పోల్కం బాలయ్యలు నియమితులయ్యారు. ఆదివారం మండల కేంద్రంలోని కురుమ సంఘం, బీరప్ప గుడి వద్ద గ్రామ కురుమ సంఘం ముఖ్యనాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించి పెద్ద కురుమ, సెల్వోజీలను ఏకగ్రీవంగా ఎన్నుకొని సన్మానించారు. కురుమ సంఘం బలోపేతం కోసం తాము నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. కురుమలు విద్యా, సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలన్నారు. కా ర్యక్రమంలో కురుమ సంఘం పెద్దలు ముచ్చింతల లక్ష్మయ్య, శ్రీశైలం, కృష్ణయ్య, చంద్రయ్య, శ్రీశై లం, పర్వతాలు, మిద్దింటి బాల్‌రాజ్, శ్రీశై లం యాదగిరి, సురేష్, బీరప్ప, రమేష్, కు మార్, శేఖర్, యాదయ్య, లక్ష్మయ్య పాల్గొన్నారు.

టీపీసీసీ ప్రచార కమిటీ కార్యనిర్వాహక సభ్యుడిగా మల్లేశ్

కందుకూరు: టీపీసీసీ ప్రచార కమిటీ కార్యనిర్వాహక సభ్యుడిగా కందుకూరుకు చెందిన పీఏసీఎస్ మాజీ చైర్మన్ సరికొండ మల్లేష్ నియమితులైయ్యారు. ఇటీవల ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే ఆయనను నియమిస్తున్నట్లు ప్రకటించారు.

భక్తి శ్రద్ధలతో బోనాలు



రాజేంద్రనగర్ జోన్ పరిధిలో బోనాల ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఆదివారం అమ్మవారి దర్శనానికి భక్తులు ఆలయాలను పెద్దఎత్తున తరలివెళ్లారు. కాగా ఉదయం నుంచే భక్తులతో ఆలయాలు కిటకిటలాడగా.. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు. పోతరాజుల విన్యాసాలు, తొట్టెల ఊరేగింపు, డప్పు చప్పుళ్లతో సామూహిక బోనాలతో భక్తులు, కళాకారులు సందడి చేశారు. రాజేంద్రనగర్, అత్తాపూర్, శంషాబాద్, శంషాబాద్‌రూరల్, తొండుపల్లి బండ్లగూడ, మణికొండ, మైలార్‌దేవ్‌పల్లి, హైదర్‌గూడ, కాకాపేట్, నార్సింగి, పుప్పాల్‌గూడ తదితర ప్రాంతాల్లో భక్తులు, ప్రజాప్రతినిధులు అమ్మవారిని దర్శించుకుని తమ మొక్కులు తీర్చుకున్నారు. – రాజేంద్రనగర్ జోన్ బృందం



బండ్లగూడలో తొట్టెల ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్



మణికొండ ల్యాంకోహిల్స్‌లో శాసనమండలి వైస్ చైర్మన్ బండా ప్రకాష్, ఎమ్మెల్యే



రాజేంద్రనగర్‌లో



కోకాపేటలో దేవాలయం వద్ద మహిళలు



మణికొండ మున్సిపల్ కమిషనర్‌ను సన్మానించిన వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి



కోకాపేటలో తొట్టెల తొలిబోనాలను ఊరేగిస్తున్న కౌన్సిలర్లు, నాయకులు



బోనాలతో దేవాలయానికి వస్తున్న భక్తులు



చిత్రపురిలో అధ్యక్షుడు అనిల్, కౌన్సిలర్ హైమాంజలి



బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి, బీజేపీ నాయకులు





బోనంతో యువతులు



బోనాల ఉత్సవాల్లో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్



కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం



తొండుపల్లిలో బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బైతి శ్రీధర్ తదితరులు



దేవాలయంలో భక్తుల కిటకిట



హైదర్‌గూడ ఆలీ పోచమ్మ దేవాలయం వద్ద..



బోనంతో ఆలయానికి తరలిన భక్తులు



మణికొండలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



పుప్పాల్‌గూడ పోచమ్మ దేవాలయంలో..

రక్తదానం ప్రాణదానంతో సమానం

ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ, నటుడునిర్మాత మురళీమోహన్ తదితరులు

రాయదుర్గం: అన్ని దానాలకంటే గొప్పది రక్తదానమని ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. గచ్చిబౌలి డివిజన్ ఖాజాగూడలోని గ్రీన్ గ్రేస్ అపార్ట్‌మెంట్స్‌లో గ్రీన్ గ్రేస్ ఎంఏసీ సొసైటీ, నారెడ్కో తెలంగాణ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని ఆయన నటుడు, నిర్మాత ఎం.మురళీమోహన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఔత్సాహిక యువతీ యువకులు రక్తదానం చేయడానికి ముందుకు రావాలన్నారు. రాష్ట్రంలో రక్తనిల్వలు తగ్గకుండా ఉండేందుకు అందరూ రక్తదానం చేయాలన్నారు. రక్తదానం చేయడంతో వ్యక్తి ప్రాణాలు కాపాడేందుకు దోహదం చేస్తుందన్నారు. మురళీమోహన్ మాట్లాడుతూ... రక్తదానం చేయడానికి ప్రతి ఒక్కరూ ముందుకొస్తే కొందరి ప్రాణాలు నిలిపేందుకు అవకాశం కలుగుతుందన్నారు. నారెడ్కో తెలంగాణ అధ్యక్షుడు బి.సునీల్ చంద్రారెడ్డి మాట్లాడుతూ... రక్తదాన శిబిరాలను నిర్వహించడం ద్వారా బ్లడ్ బ్యాంక్‌లలో రక్త లభ్యతలో అంతరాన్ని తగ్గించడంలో మేము దోహదపడుతున్నామన్నారు. నారెడ్కో తెలంగాణ నిర్వహించే రక్తదాన శిబిరాల నిర్వహణకు ఇతర సంఘాలు సహకరించాలన్నారు. నారెడ్కో తెలంగాణ రాష్ట్ర సెక్రటరీ జనరల్ విజయ సాయిమేక, గ్రీన్ గ్రేస్ మాక్ సొసైటీ అధ్యక్షుడు బి.వెంకట్‌రమణ, ప్రధాన కార్యదర్శి ఎస్.నర్సింహారెడ్డి, కె.శ్రీధర్‌రెడ్డి, బి.వెంకటరమణారెడ్డి, పలువురు సభ్యులు, అపార్ట్‌మెంట్‌వాసులు పాల్గొన్నారు.

అంటువ్యాధులపై మరింత అవగాహన అవసరం



ఐడీసీఓఎన్ సదస్సు ప్రారంభ వేడుకల్లో పాల్గొన్న వైద్యుల బృందం

నానక్‌రాంగూడలో మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఇన్ఫెక్షియస్ డిసీజ్ కాన్ఫరెన్స్

రాయదుర్గం: అంటువ్యాధులపై మరింత అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని పలువురు వైద్యులు సూచించారు. నానక్‌రాంగూడలోని షరటాన్ హోటల్‌లో ఇన్ఫెక్షియస్ డిసీజ్ కాన్ఫరెన్స్ (ఐడీసీఓఎన్)ను నానక్‌రాంగూడలోని షరటాన్ హోటల్‌లో మెడికవర్ ఆస్పత్రుల ఇంటర్నల్ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికవర్ ఆస్పత్రి క్లినికల్ సర్వీసెస్ డైరెక్టర్, సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ శరత్‌రెడ్డి, సీనియర్ కన్సల్టెంట్ న్యూరాలజిస్ట్ డాక్టర్ హరిరాధాకృష్ణ, సీనియర్ కన్సల్టెంట్ న్యూరోసర్జన్ డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి జ్యోతి వెలిగించి ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కష్టమైన లేదా అరుదైన అంటు వ్యాధుల నేపథ్యంలో అవగాహన పెంచడం, సంసిద్ధతను పెంపొందించే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. అంటువ్యాధులు దేశాలను ప్రభావితం చేసే ఒక ముఖ్యమైన ప్రపంచ సవాలుగా మారుతాయన్నారు. ఇది వైరల్ వ్యాప్తి, బాక్టీరియల్ ఇన్ఫెక్షన్ లేదా కొత్త వ్యాధుల ప్రభావం తీవ్రంగా, చాలా దూరంగా ఉంటుందన్నారు. ఆరోగ్య సంరక్షణ నిపుణులు, సాధారణ ప్రజలకు సమాచారం ఇవ్వడం, అవసరమైన జ్ఞానాన్ని పొందడం, అంటువ్యాధులతో సంబంధం ఉన్న ప్రమాదాలను తగ్గించడానికి నివారణ చర్యలను అనుసరించడం అవసరమన్నారు. కార్యక్రమంలో పలువురు వైద్యులు, 200కు పైగా మెడికల్ కాలేజీల నుంచి స్టూడెంట్స్ పాల్గొన్నారు.

అక్రమంగా విక్రయిస్తున్న మద్యం బాటిళ్ల పట్టివేత

శంషాబాద్ రూరల్: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం.. పెద్దగోల్కొండకు చెందిన ఎస్.శ్రీశైలం అక్రమంగా మద్యం అమ్ముతున్నట్లు పోలీసులకు ఆదివారం సమాచారం అందింది. దీంతో అక్కడకు వెళ్లి పరిశీలించగా.. షెడ్డులో బీరు, విస్కీ బాటిళ్లు లభించాయి. దీంతో అతనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమంగా రేషన్ బియ్యం..

శంషాబాద్ రూరల్: అక్రమంగా రేషన్ బియ్యాన్ని సేకరిస్తున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.ఈ ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దగోల్కొండ శివారు లో అక్రమంగా రేషన్ బియ్యాన్ని సేకరిస్తున్నట్లు ఆదివారం పోలీసులకు సమాచారం అందడంతో వెళ్లి పరిశీలించగా.. ఆటో ట్రాలీలో బియ్యం బస్తాలు ఉన్నాయి. రేషన్‌బియ్యం ఉన్నట్లు గుర్తించిన పోలీసులు స్టేషన్‌కు తరలించారు. బియ్యం సేకరిస్తున్న వ్యక్తిని యాదాద్రి జిల్లా బొమ్మలరామారం వాసి డి.బాస్కర్‌గా గుర్తించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వంట సామగ్రి బహూకరణ



వంట సామగ్రిని అందజేస్తున్న శ్రీశైలం

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని జిన్నాయిగూడ లక్ష్మీనరసింహా స్వామి ఆలయానికి రావిర్యాలకు చెందిన భక్తుడు నక్క శ్రీశైలం యాదవ్ ఆదివారం వంట సామగ్రిని బహూకరించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ శివశంకర్ మాట్లాడుతూ.. ఆలయానికి వచ్చే భక్తులకు అన్నం వండేందుకు వంట సామగ్రి ఉపయోగపడుతాయన్నారు. దాతలు ఆలయ అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో శ్రీకాంత్, యాదయ్య, ఐలయ్య, సురేష్ పాల్గొన్నారు.

ఎట్టకేలకు మండల సర్వసభ్య సమావేశం

- మరోసారి వాయిదా పడకుండా జాగ్రత్తలు
- ఫోన్లు చేసి సభకు రావాలని బతిమిలాడిన వైనం



మాట్లాడుతున్న ఎంపీపీ జయమ్మ

శంషాబాద్ రూరల్: కోరం లేక ఒక రోజుకు వాయిదా పడిన సభ.. ఎట్టకేలకు సగం మంది సభ్యుల హాజరుతో సాదాసీదాగా సాగింది. మండల పరిషత్ కార్యాలయ సమావేశ హాల్‌లో ఆదివారం ఎంపీపీ జయమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. శనివారం జరగాల్సిన ఈ సభను కోరం లేక ఆదివారానికి వాయిదా వేసిన సంగతి తెలిసిందే.

- ఎంపీపీతో పాటు ఐదుగురు ఎంపీటీసీ సభ్యులు రావడంతో సభను ప్రారంభించగా.. చివరలో వైస్ ఎంపీపీ నీలం సభకు రావడం గమనార్హం. సభ జరిగేందుకు ఎంపీటీసీలకు ఫోన్లు చేసి బతిమాలినట్లు సమాచారం.

గ్రామాల్లో స్పెషల్ డ్రైవ్..

- ఈ నెల 16 నుంచి 20 వరకు గ్రామాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీఓ ఉషాకిరణ్ ప్రకటించారు.
- రోడ్లు, మురుగు కాలువలను శుభ్రం చేయడంతో పాటు తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలన్నారు. పరిసరాల పరిశుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించడానికి సర్పంచులు చొరవ తీసుకోవాలన్నారు. తొండుపల్లి నుంచి కామునిచెరువు వరకు ఫీడర్ చానల్ ఏర్పాటుకు రూ.30 లక్షలు మంజూరైనట్లు ఇరిగేషన్ సిబ్బంది తెలిపారు.
- గ్రామాల్లో రోడ్లు, భవన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని సభ్యులను కోరారు.

సభకు కొన్ని శాఖల అధికారులు మాత్రమే హాజరయ్యారు. జెడ్పీటీసీ తన్వీరాజు, డీసీసీబీ డైరెక్టర్ బుర్కుంట సతీష్, ఎంపీటీసీ సభ్యులు యాదయ్య, ఇందిరా, సరితా, యాదగిరి, క్రాంతికుమార్, సర్పంచ్‌లు ఇస్తారి, రవీందర్, రాజ్‌కుమార్, ఎంపీడీఓ వసంతలక్ష్మి, ఎంఈఓ రాంరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ జగన్‌మోహన్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ యాదగిరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముదురుతున్న వివాదం..

సర్వసభ్య సమావేశానికి ఎంపీటీసీ హాజరుకాకపోవడానికి స్పష్టమైన కారణాలు తెలియకున్నా.. ఎంపీపీ, ఎంపీటీసీల మధ్య వివాదం ముదురుతున్నట్లు కనిపిస్తోంది. అధికారులపై ఎంపీపీ భర్త అజమాయిషీ ఎక్కువైనట్లు సమాచారం. ఈ విషయాన్ని ఇదివరకే ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. దళితబంధు లబ్ధిదారులు, కాంట్రాక్టర్ల నుంచి ఓ సిబ్బంది లంచాలు తీసుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సదరు సిబ్బంది చేస్తున్న చర్యలతో మిగిలినవారు ఇబ్బందులు పడుతున్నట్లు సమాచారం. ఇక్కడ నుంచి బదిలీకావడం తప్పా.. వేరే గత్యంతరం లేదనే భావనకు వచ్చినట్లు తెలుస్తోంది.

గ్రామాభివృద్ధే లక్ష్యంగా కృషి



సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న సురేష్

సర్పంచ్ సురేష్

మహేశ్వరం: గ్రామాల్లో మౌలిక వసతులను కల్పించి అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తానని సిరిగిరిపురం సర్పంచ్ కాసుల సురేష్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని సిరిగిరిపురంలోని 3వ, 4వ వార్డుల్లో సీసీ రోడ్డు నిర్మాణ పనులను వార్డు సభ్యులు, గామస్తులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...గ్రామంలో ప్రతి వార్డులో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్డు నిర్మాణ పనులతో పాటు, ప్రతి వీధి స్తంభానికి ఎల్ఈడీ లైట్లు, పల్లె ప్రగతి కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి పనులు చేపడుతామన్నారు. వార్డు సభ్యులు, గ్రామ పెద్దల సహకారంతో గ్రామంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ఆదర్శవంతమైన గ్రామంగా తీర్చిదిద్దుతానని తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.